# మనసులో ఏముందో మనసుకేగా తెలుసు!

తమిరిశ జానకి

1964లో మొదటి కథ వై.జె. (యర్రమిల్లి జానకి) పేరుతో అచ్చయింది. తర్వాతి సంవత్సరం పెళ్లిచేసుకుని తమిరిశ జానకి అయ్యారు. అప్పటినుంచి వివిధ పత్రికలలో ఆమె రాసిన కథలు వందల సంఖ్యలో వుంటాయి. పదమూడు నవలలు, పలు కవితలు వెలువరించారు. ఈమె మొదటి నవల "విశాలి" ఆంధ్రప్రభ వారపత్రికలో ధారావాహికంగా వచ్చింది. తరువాత అదే పేరుతో సినిమాగా వచ్చింది. నలభయ్యేళ్లకు పైగా రచనలు సాగిస్తూ, కథా రచయిత్రిగా తమిరిశ జానకి మంచి పేరు తెచ్చుకున్నారు. వీరి కథలు హిందీ కన్నడ భాషలలోకి వెళ్లాయి. వీరి కథలు చాలావరకు సంపుటాలుగా వెలువడి పాఠకుల ఆదరణ పొందాయి. సత్సాంప్రదాయాలకు విలువనిస్తూ, ఆధ్యాత్మికతను రంగరిస్తూ పాత్రలను నడిపించడం యీమె ప్రత్యేకత. సహజంగా వుండే వాతావరణంలో, హాయిగా చదివించే శక్తి జానకి కథలన్నింటిలోనూ వుంది. దాదాపు పాతికేళ్ల క్రితం రాసిన కథ యిది.

ఆమె తలపులు చిట్టిబాబు వీణ వీనులవిందు చేస్తున్న అనుభూతి.

ఆమెని గుర్చిన ఆలోచనలు బాలమురళి పాట వింటున్నంత తన్మయత్వం.

ఆమెతోడి ఊహాలోకం యామినీ కృష్ణమూర్తి నృత్యావలోకనమే.

సౌరభములేల చిమ్ము పుష్ప ప్రజంబు
చంద్రికలనేల వెదజల్లు చందమామ
ఏల సలిలంబుపారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?

దేవులపల్లి వారి కవిత నాలో మెదిలింది నాలుగేళ్ళ క్రిందట మొదటిసారి ఆమెని చూసినప్పుడే.

ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను? ఈ ప్రశ్నకి సమాధానం అప్పటికీ, ఇప్పటికీ నేను చెప్పలేను.

నాలుగేళ్ళ కిందట మొదటిసారి ఆమెని గుళ్లో శివ లింగం పూలచెట్టు కింద చూసిన ఆ క్షణం నా జీవితంలో మధురమైన అనుభూతిని కలిగించిన క్షణం అని చెప్పాలి. నా జీవితంలో ఆ రోజు ఒక గొప్ప సుదినం అనే చెప్పాలి.

నా జీవితం అని అంటున్నాను - నాకెంతో వయసు లేదు - ఇరవై మూడేళ్ళు నాకిప్పుడు. రెండేళ్ళ క్రిందట బి.ఏ. పూర్తయ్యింది.

చదువులో నాకు పెద్ద తెలివితేటల్లేవు - యావరేజ్ స్టూడెంటుని.

నాకు స్నేహితులూ తక్కువే మొదటినించీ.

గొప్పలు చెప్పుకోడం కాదుగానీ- అమ్మాయిల

## ఆణిముత్యాలు

వెంటపడటం, వాళ్లని ఆకర్షించేందుకు వెఱ్ఱిమొర్రి వేషాలు వేయటం లాంటివి నాకెప్పుడూ అలవాటు లేదు. ఏ అమ్మాయి వంకా కన్నెత్తి చూడని ప్రవరాఖ్యుదన్న బిరుదు కూడా ఇచ్చారు కాలేజీలో నాకు. అటువంటి నాలో - హఠాత్తుగా కలిగింది మార్పు, నాలుగేళ్ల క్రిందట ఆమెని చూసిన తొలి చూపులోనే.

"ఒరేయ్ అబ్బాయ్!"

అమ్మ పిలుపుతో, లేచి కూర్చున్నాను మంచంమీద.

"ఏవిట్రా? ఎప్పుడూ ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఉంటావూ?" జాలీ, ఆశ్చర్యం కలగలిసిన

దీర్ఘం అమ్మ గొంతులో... ఆ ప్రశ్నలో.

ఏమని చెప్పను? ఎలా చెప్పను? ఎలా చెప్తే అమ్మ అర్థం చేసుకోగలదు? అసలు అర్థం చేసుకోవానికి ప్రయత్నిస్తుందా? పిచ్చివాడిని చూసినట్టు చూడదూ? వెర్రిబాగులవాడివంటూ ఒక్క మాటలో తేల్చి పడెయ్యదూ? ఉహూ... చెప్పను... చెప్పలేను. నా అనుభూతిని... నా అంతరంగ మథనాన్ని ఇంకా కొన్నాళ్లపాటు బయటికి చెప్పుకోడానికి లేదు. అందుకేగా... ఇన్నాళ్ళుగా... నాలుగేళ్ళుగా... పొరపాటున కూడా ఎవరి దగ్గరా నేను నోరు జారనిది!

"నిన్నేరా అబ్బాయ్"

"ఏమిటమ్మా?"

"రంగారావుగారమ్మాయిని చేసుకుంటే పదిహేను వేలు కట్నం ఇస్తామంటున్నారు. భూషయ్యగార మ్మాయిని చేసుకుంటే ఇరవైవేలిస్తామంటున్నారు..."

"అమ్మా... చెప్పాను కదమ్మా నాకిష్టంలేదని. ఇప్పుడప్పుడే చేసుకోనని. కట్నం తీసుకోనని కూడా చెప్పానుకదమ్మా."

"హూ... బావుంది నీ వరస. అదే పాట పాడు తున్నావు రోజూ. మనసు మార్చుకోవెందుకనీ. కట్నం పుచ్చుకునే విషయంలో మనం ఏమన్నా ఇంతివ్వండి, అంతివ్వండి అని రొక్కించి అడుగుతున్నామా? వాళ్ళం తట వాళ్ళుగా ఇస్తామంటూ ముందుకొస్తున్నారు."

"వాళ్ళెంత ఇస్తామన్నా నా కిష్టంలేదు. నన్ను క్షమించమ్మా. అయినా.. అమ్మా... నాకిప్పుడు ఇరవై మూడేళ్ళే కదా! ఏవంత వయసైపోయిందని, అంత తొందరపడిపోవటానికి? ఇంతవరకూ ఉద్యోగమన్నా దొరకలేదు కదా? ఉద్యోగం లేకుండా... నా కాళ్ళమీద నేను నిలబడకుండా..." నా మాట పూర్తికాకుండానే అందుకుంది అమ్మ మళ్ళీ.

"అదేగా నేను చెప్తున్నదీ. ఆ రంగారావు గారమ్మా యిని చేసుకుంటే కట్నం ఒక్కటే కాదు, ఉద్యోగం కూడా వేయిస్తామంటున్నారాయన. ఈ నెలలో మంచి ముహూర్తాలున్నాయని కబురు కూడా చేశారు. నువ్వు పిల్లనెప్పుడు చూస్తానంటే అప్పుడు ఏర్పాట్లు చేస్తా నన్నారు."

"అమ్మా.. నన్ను క్షమించమ్మా. నా పెళ్ళికప్పుడే తొందర్లేదు"

అంతకంటే ఇంకొక్కమాట నా నోట్లోంచి రాలేదు. ఔను. అప్పుడే చెప్పడానికి లేదు. నాకు ఉద్యోగం దొరకాలి ముందు. దొరికిన వెంటనే వెళ్ళి సభాపతి గారిని కలవాలి. అప్పుడేకదా పుష్కర గురించి అమ్మతో చెప్పగలను.

నా హృదయంలో పదిలంగా దాచుకున్న ఆ దేవి గురించి పుష్కర గురించి... ఈ నాలుగేళ్ళుగా పొర పాటున కూడా ఎవరితోనూ నేను అనలేదు.

నేను కలలు కంటున్న ఆ రోజు కోసం ఊపిరి తీయడమే మరచిపోయినట్లు ఎదురు చూస్తున్నాను అంతలా.

ఎంత తొందరగా కాలం పరిగెట్టి ఆ రోజుని నా ముందు నిలబెడుతుందా అన్న నిరీక్షణలో నిలువెల్లా తపించిపోతున్నాను.

కనురెప్ప వాలిస్తే కాలం ఆగిపోతుందేమోనన్న భయంతో కంటిమీద కునుకే కరువైంది నాలుగేళ్లుగా.

ఎవరితో మాట్లాడాలన్నా... ఎక్కడికి వెళ్ళాలన్నా ఏదో వెలితి.

అందుకే... ఎవరితోనూ కబుర్లు చెప్పాలనిపించక నిశ్శబ్దంలో... మౌనంగా.. మనసులో మేలిముసుగులో దాగిన.. ఆమెతో... నా దేవితో... తీయని మూగ ఊసులు అల్లుకోవడం అలవాటైపోయింది..

ఇది పిచ్చి కాదు, మోజు అంతకంటే కాదు. నా మనసులోని ఈ అనుభూతి మరొకరికెలా అర్థమవు తుంది? అర్థమయ్యేలా చెప్పగలగడం నాకూ అంత సులభం కాదు.

"ఏమిట్రా ఎంత చెప్పినా నీ మాట నీదే. ఇంటి పరిస్థితి కూడా అర్థం చేసుకోవాలి నువ్వు. నీ తమ్ముళ్లు చెల్లెళ్లు ఇంకా చదువులు పూర్తికానివాళ్ళు. నీకా ఏ ఉద్యోగం దొరకలేదింకా. ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకో నంటూ వచ్చిన మంచి సంబంధాలన్నీ వదిలేస్తున్నావు. కాబోయే మామగారే ఉద్యోగం వేయిస్తానంటుంటే ఇంక మనకి బాధేముంది? పైగా కట్నం తీసుకో నంటున్నావు. వాళ్ళంతట వాళ్ళుగా ఇస్తామంటున్నారు. అవసరం ఉన్నవాళ్ళం మనం... వద్దనడమెందుకూ? ఇంకోసారి బాగా ఆలోచించుకో'' సణుగుతూ వంటింట్లోకి వెళ్ళిపోయిందమ్మ.

నేను మిగిలాను నా ఆలోచనల్లో.

నాలుగేళ్ళ వెనక్కి వెళ్లిపోయింది నా మనసు.

○ ○ ○

ఆ రోజు.

బంధువుల ఇంటికని నర్సాపురం వెళ్ళిన మొట్ట మొదటి రోజు.

గుడిలో... శివలింగం పూల చెట్టు కింద...

## పడిలేచే కడలి తరంగం

తీరం దగ్గర నిలబడి
సముద్రాన్ని చూచినప్పుడల్లా
అలలతో / ఆటుపోట్లతో
ఉవ్వెత్తుగా ఎగిసిపడే సముద్రం
నీలంగా
భయంకరమైన కాళరాత్రిలా తోచే సముద్రం
నాకు / అమాయకంగా
నట్టింట్లో దోగాడే పసిబాలుడిలా తోస్తుంది.
అది నా దృక్పథమో!
కనిపించే ప్రతి దృశ్యం!
మన / మనోవల్మకం నుండి
దూసుకొచ్చిన ఒక స్నిగ్ధ చిత్రం!
అంతేకాదు / మన భావనా ఝురి నుండి
తరలివచ్చిన ఒక కాంతిపుంజం.

❖ ❖ ❖

జీవితం
సప్తవర్ణాల ఇంద్రధనస్సు
కనిపించని చూపులోనుండి
అగుపించని భావనా పథం నుండి
ఆటుపోట్లతో
అనుక్షణం భావోద్వేగాలతో
ఎగిసిపడే ఒక కడలి తరంగం
ఎత్తు పల్లాలతో / కష్టసుఖాలతో
బరువు బాధ్యతలతో
నిత్యం
మన కళ్ళముందు దోబూచులాడే
మనకు అంతుబట్టని
ఒకానొక మనో విహంగం

❖ ❖ ❖

జీవితం వేరు / సముద్రం వేరు.
అందరి దృష్టిలో / అందరి దృక్పథంలో
అంతే.
కానీ–
కష్టాల కడలిలో తేలియాడుతూ
సుఖాల రసమయ జగత్తులో ఓలలాడుతూ
ముందుకు పోతే / జీవితం
పడిలేచే ఒక కడలి తరంగం.

–డాక్టర్ ధూర్జటి వేంకట బాలాజీ

సన్నజాజి రెమ్మలా ఆమె.

పక్కనున్న మరో అమ్మాయితో నవ్వుతూ మాట్లాడుతున్న ఆమె గొంతు వీణ మీటినట్టే ఉంది. అది మరొకరూ మరొకరూ మీటిన వీణకాదు... చిట్టిబాబు వీణే.

ఆమె మాటలో వినిపించేది కోయిలపాటే.

ఆమె కదలికల్లో కనిపించేది మయూరి నృత్యం కాక మరేమిటి?

ఆమె అడుగుజాడలో హంస నడకలే.

తొలి చూపులోనే ప్రేమ కలగటం అంటే ఏమిటో అనుభవంలోకి వచ్చింది. నాకు ఆమెని చూసిన ఆ మొదటి క్షణమే.

మనసులో రేగాయి వింతైన పులకింతలు.

మరెన్నో మధుర భావనలు.

ఎన్ని జన్మల బంధమో మా మధ్య ఉన్న అనుభూతి.

ఆమె నా స్వంతమన్న అతి గాఢ విశ్వాసం.

ఇంతకంటే అందమైన అమ్మాయిలు మా కాలేజీలో లేకపోలేదు... కానీ... వాళ్ళెవర్నీ కూడా నా మనసు పట్టించుకోలేదు. ఇటువంటి పులకింత వాళ్ళెవరిన చూసినా కూడా నాకెప్పుడూ కలగలేదు.

నా మనసు దోచుకున్న ఈమెని తప్ప మరెవరినీ పెళ్ళి చేసుకోకూడదన్న అభిప్రాయం ఆ క్షణంలోనే నా మనసులో ఏర్పడిపోయింది. నా ప్రేమ పిచ్చిదని, నేనో వెర్రివాడినని ఎవరైనా అనుకున్నా నేను బాధపడదల్చుకోలేదు. ఆమెని పెళ్ళి చేసుకోగలిగితే అంతే చాలు. నా జీవితం ధన్యమైనట్టే.

ఆమె వెనకే వెళ్ళి వాళ్ళ ఇల్లెక్కడో తెలుసుకున్నాను.

మర్నాడు ఆమె ఇంటిముందు కాపువేసి ఆమె వెనకే కాలేజీ వరకూ వెళ్ళాను. ఆమె పేరు పుష్కర అనీ, సీనియర్ ఇంటర్ చదువుతోందనీ, తండ్రి పేరు సభాపతి అనీ వివరాలు సేకరించగలిగాను.

ఆమె కాలేజికి వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు ఆమెనే గమనిస్తూ మరో ధ్యాసే లేనట్టు తిరిగాను.

నేను మళ్ళీ మా ఊరెళ్ళిపోయేరోజు వచ్చేసింది.

రేపే నా తిరుగు ప్రయాణం.

మరి ఆగలేదు నా మనసు.

ఆమె తండ్రితో ఒక్కమాట చెప్పాలని... ఒక్క మాట అడగాలని తొందరపెట్టింది మనసు.

అందుకే ఆ సాయంత్రం వాళ్ళింటికి కొద్ది దూరంలో రోడ్డు పక్కగా నిలబడి, ఆమె తండ్రి సభాపతి గారు బయటికి వస్తారేమోనని ఆ ఆదివారం సాయం

త్రం చల్లని వాతావరణంలో.. నిమిషాలు లెక్కబెడుతూ నిలబడ్డాను. నా నిరీక్షణ వృథా కాలేదు.

సభాపతి ఇంట్లోంచి బయటికొచ్చి ఎటో బయ ల్దేరారు.

మెల్లిగా ఆయన్ని చేరుకున్నాను. నెమ్మదిగా పిలిచాను.

"సార్!"

పక్కకి తిరిగి చూశారాయన.

ఇంతవరకూ ఆయన్ని ఎవరూ పిలవలేదేమో ఎప్పుడూ! ఆయన కళ్ళల్లో ఎంతో ఆశ్చర్యం.

"నా పేరు రవీంద్ర. మాది విజయవాడ. మా నాన్నగారి పేరు వాసుదేవరావుగారు బిజినెస్ చేస్తారు విజయవాడలో. మాకు సొంత మేడ, కారు ఉన్నాయి."

"విజయవాడలో బిజినెస్‌మాన్ వాసుదేవరావుగారి పేరు నేను విన్నానయ్యా. చాలా పెద్ద అంతస్తులో మనిషి" సభాపతిగారి గొంతులో గౌరవభావం తొణికిస లాడింది.

"మా బంధువుల ఇంటికని నేనీ ఊరొచ్చి వారం రోజులైందండీ, రేపు వెళ్ళిపోతున్నాను."

నా గొంతు తడబడింది, ఒక్క క్షణం.

అసలు సంగతేమిటో అర్థంకాక అయోమయంగా చూస్తున్నారు సభాపతిగారు.

"నే నీ ఊరొచ్చిన మొదటిరోజే మీ అమ్మాయి పుష్కరని గుడిలో చూశాను" నా స్వరంలో అదోరకమైన మార్పు నేనే గమనించాను.

మధురమైన భావన మనస్సు విప్పి మరొకరితో చెప్పుకునేటప్పుడు ఆనందపారవశ్యం వల్ల వచ్చిన మార్పు అది.

"ఈ వారం రోజులుగా ఆమెని చూస్తూనే ఉన్నాను రోజూ. మొదటి చూపులోనే ఆమెని నేను ప్రేమించాను. నిజం. నా మాట నమ్మండి. నేనామెను పెళ్ళి చేసు కుంటాను. నేనామెను ప్రేమిస్తున్నాను."

తెల్లబోయి చూస్తున్న సభాపతిగారిలో మెల్లగా కదలిక వచ్చింది.

"అలా పార్కులో కూర్చుని మాట్లాడుకుందాం పద" గంభీరంగా అంటూ ముందుకి నడిచారు.

పార్కులో పచ్చగడ్డిలో కూర్చున్నాక సూటిగా నా కళ్ళల్లోకి చూశారు, "ఊ... ఇప్పుడు చెప్పు"

"నిజం చెప్తున్నానండీ. ఊరికే అనటంలేదు. మీ అమ్మాయి తొలిచూపులోనే నా మనసులో చోటుచేసు కుంది. నే నామెని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. ప్లీజ్ అలా నవ్వకండి. నన్నర్థం చేసుకోండి."

"ఇది నిన్ను వెక్కిరించే నవ్వు కాదు బాబూ! నీ ప్రేమని తలుచుకుని జాలిపడుతున్న నవ్వు. నా అంత స్తుని చూసుకుని నేనే నవ్వుకునే నవ్వు. ఊ... ఏం చదువుతున్నావు?"

"బి.ఏ. ఫైనల్ ఇయర్"

"వయస్సెంత?"

"ఇరవయ్యేళ్ళండీ. కాలేజీలో ప్రేమా దోమా అంటూ అమ్మాయిల వెంట తిరిగిన రకాన్ని కాదండీ. ఇంటా, బయటా కూడా బుద్ధిమంతుడని పేరు తెచ్చు కున్న వాడినే. అందులో మీకే సందేహం అక్కర్లేదు. దయచేసి గొప్పలు చెప్పుకుంటున్నానని అనుకోకండి" గబగబా చెప్పేసి ఊపిరి పీల్చుకున్నాను.

"మీ నాన్నగారు బాగా డబ్బున్నవారు ఔనా? పెద్ద అంతస్తులో వాళ్ళు మీరు. మరి నేనో కాట్లో పద్దులురాసే

## జీవి(తం)

కన్ను తెరిస్తే జననం
కన్ను మూస్తే మరణం
ఈ మధ్యలో నరకయాతనే
జీవితం...

## విజయ సోపానం...

జీవితం కొందరికి పూలబాట
మరికొందరికి ముళ్ళబాట
మరి ఇంకొందరికి ముళ్ళ-పూల బాట
కానీ... ఈ ముళ్ళబాటే
జీవితానికి విజయ సోపానం..

## నీ రాక...

నీవు రాక ముందు
నేను రాయినై ఉంటిని...
నీ ఆగమనం తర్వాత
నే మనిషినైతిని
నీ ప్రేమామృతంతో నా మది
ప్రేమను తట్టింది...
అప్పుడే ప్రేమంటే
తెలియని నాకు ప్రేమంటే
ఏమిటో తెలిసింది!

-తాటికోల శ్రీనివాసరావు

గుమాస్తాని. తెలుసా నీకు?"

"తెలుసండీ వివరాలు వాకబు చేశాను"

"మరి మీబోటివాళ్ళతో వియ్యమందే హక్కు మాబోటివాళ్ళ కెక్కడుంది?"

"అలా అనకండి ప్లీజ్. ప్రేమకు ఆస్తులతో, అంతస్తులతో సంబంధం లేదు."

"ప్రేమకు లేకపోవచ్చు బాబూ! నిన్ను కన్నవాళ్ళకి మాత్రం తప్పకుండా ఉంటుంది."

"వాళ్ళని ఎదిరించి అయినా మీ అమ్మాయిని..."

"చూడు బాబూ? నీది ఉడుకురక్తం. ఈ వయసులో ఆవేశం అలాగే ఉంటుంది."

"నేను ఆవేశంతో అనటం లేదండీ"

"ఉండు... నన్ను పూర్తిగా చెప్పనీ... నాకు కొడుకు ల్లేరు. నలుగురూ కూతుళ్ళే... నువ్వు తొలిచూపులోనే ప్రేమించానంటున్న ఆ పుష్కర నా మూడో కూతురు. సీనియర్ ఇంటర్ చదువుతూంది. రెండో కూతురు డిగ్రీ మొదటి సంవత్సరం. నాలుగోది హైస్కూల్లోనూ చదువుతున్నారు. పెద్దపిల్ల పెళ్ళికి చాలా అప్పు చేశాను. అందుకే గుణపాఠం నేర్చుకున్నాను. ఇంక ఈ ముగ్గురి

## సమర్థుడు

**మం**డలంలో ఉద్యోగం
అక్కడే వివిధ పోస్టులు
జిల్లాలో ప్రమోషన్లు
అక్కడే పదవీ విరమణ

## గుర్తింపు

**క**ర్తవ్య నిర్వహణ / పరిపాలన పటిష్టం
ఫలితం బదిలీ / నిజాయితీకి బహుమానం

## దైవాధీనం

**సి**గ్నల్లు, జిబ్రాలైన్లు/బందరు రోడ్డుపైన నడవాలా?
ఒళ్ళంతా కళ్ళుచేసికో
అయినా ట్రామాసెంటర్లో చేరగలవు!

## ఆరోగ్యం

**అ**ధిక ఆహారం / శారీరక అనారోగ్యం
అక్రమ సంపాదన
మానసిక అనారోగ్యం

-పరుచూరి శ్రీనివాసరావు

పిల్లల పెళ్ళిళ్ళకీ అప్పులు చేయదల్చుకోలేదు. కట్నాలూ ఇవ్వదల్చుకోలేదు..."

"నాకు కట్నం వద్దండీ... నేను తీసుకోను"

"నీ కొద్దంటావు, బాగానే ఉంది. నీ తల్లితండ్రులు ఒప్పుకోవద్దూ?"

"వాళ్ళని ఎదిరించి అయినా..."

"అదిగో మళ్ళీ అదే మాట. ప్రేమంటే ఏమిటో కూడా తెలియని పసివాడివి నువ్వు. ఆవేశంతో నువ్వన్న మాటలు పట్టుకుని... నీకూ, నీ వాళ్ళకీ మధ్య కలతలు రేపమన్నావా నన్ను?"

"అది కాదండీ"

"చూడు బాబూ... ఇంకా చదువుకుంటున్న చిన్న కుర్రాడివి... ఇరవయ్యేళ్ళవాడివి. అప్పుడే పెళ్ళి వయసు రాలేదు నీకు. నా పెద్ద కూతురికి ఇరవయ్యేళ్ళు వచ్చాకే... గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాకే పెళ్ళి చేశాను. తక్కిన పిల్లలక్కూడా కనీసం గ్రాడ్యుయేషన్ చెప్పిస్తాను. ఇరవయ్యేళ్ళు వస్తేగానీ ఎవరికీ పెళ్ళి చెయ్యను. పుష్కర పెళ్ళి ఇంకో నాలుగేళ్ళ తరువాతిమాట. నా ఇంట్లో లక్ష్మి లేదుగానీ సరస్వతి ఉంది. నా కూతుళ్లు ముగ్గురూ చదువుల్లో ఫస్టే. అందుకే వాళ్ల చదువులకి డబ్బు కొరత లేకుండా రాత్రీ పగలూ కష్టపడి డబ్బు సంపాదిస్తాను. వాళ్లకి నేనేమీ సిరిసంపదలు ఇవ్వలేకపోయినా కనీసం కాలేజీ చదువైనా చెప్పించాలని నా పట్టుదల. సిరిసంపదలు ఒకరోజున్నట్టు మరోరోజుంటాయని చెప్పలేం. విద్య అలాంటిది కాదు కదా?"

"మీ మూడో అమ్మాయి చదువు పూర్తయ్యేవరకూ పెళ్ళికి నేను తొందరపడను, ఆగుతాను. ఆమె చదువయ్యాకే..."

నవ్వారు సభాపతిగారు. "అయితే నాలుగేళ్ళ తర్వాత కూడా నీ మనసు మారకుండా, నీ ప్రేమ ఇలాగే ఉంటే నా కూతుర్ని నువ్వు చేసుకుందుకు నాకే అభ్యంతరం లేదు. ఆ రోజుకు కూడా నీ ప్రేమ ఇలాగే ఉంటే నీది నిజమైన ప్రేమేననీ, ఆవేశం కాదనీ ఒప్పుకుంటాను."

"కానీ... కానీ... మీరు మరో సంబంధమేదైనా..."

నా సందేహం ఆయనకు అర్థం అయింది.

"అబ్బెబ్బే! నిన్ను మర్చిపోను. నీ అంతట నువ్వుగా వచ్చావు. నీకు నా కూతురి మీద కలిగిన ఈ ప్రేమ నాలుగైదేళ్ళ తర్వాత కూడా చెక్కుచెదరకుండా ఇలాగే ఉంటే... అప్పుడు నువ్వొచ్చి పెళ్ళి చేసుకుంటానని అడిగితే అంతకంటే సంతోషించవలసిన దేముంటుంది

నాకు?"

మౌనంగా చూస్తున్న నా భుజంమ్మీద మృదువుగా తట్టారు. "ఇలా నిక్కచ్చిగా మాట్లాడానని మరోలా అనుకోకు. కారణాలు వివరించానుగా? ఇవి ఇదివరకటి రోజులు కావు. చిన్న వయసులోనే పెళ్ళిళ్ళు చేసుకోడం కంటే అమ్మాయీ, అబ్బాయీ వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడ్డాక, నాలుగూ చక్కదిద్దుకునే లోకజ్ఞానం అలవడ్డాక పెళ్లి చేసుకోడం మంచిదని నా అభిప్రాయం. ఇంక వెళ్దామా?"

వెళ్దామన్నట్టుగా తల ఊపి లేచాను.

❍ ❍ ❍

ఆమెని గుర్చిన ఆలోచనల్లోనే రోజులు, నెలలూ గడచిపోతున్నాయి నాకు.

నా ఫైనల్ ఇయర్ పూర్తయ్యేటప్పటికి మా ఇంట్లో ఊహించలేని మార్పులొచ్చాయి.

వ్యాపారంలో నాన్నగారికి విపరీతమైన నష్టాలు ఓ పక్క

ఆయనకున్న దురలవాట్లు- గుర్రప్పందాలు, తాగుడికి లెక్కకు మించి చేసిన అప్పులు ఓ పక్క

కొంతైనా అప్పులు తీర్చేందుకు, కొంతైనా నష్టాలు భర్తీ చేసుకునేందుకు మా ఇల్లు అమ్మేసి ఓ చిన్న అద్దె ఇంట్లోకి మారిపోవలసి వచ్చింది. ఆస్తీ అంతస్తూ తరిగిపోవడంతో ఇంట్లో అందరూ బాధపడ్డారు, పడుతూనే ఉన్నారు. కానీ... కానీ నా మనసులో నిండిపోయిన ఆమె కోసం... నా హృదయంలో పదిలంగా దాచుకున్న ఆ దేవి కోసం... ఆమెనే పెళ్ళి చేసుకోవాలన్న గాఢమైన కోరికతో... ఆస్తీ అంతస్తూ లేని ఈ మామూలు జీవితం ఎంతో సుందరంగా, మరెంతో తృప్తిగా ఉంది నాకు. ఇప్పుడింక ఆ సభాపతిగారికి అభ్యంతరం అసలుండదని నా ఆనందం. ఔను మరి? అంతస్తుల భేదం ఇప్పుడింక లేదు మా మధ్య. అందుకే ఒక్కసారిగా మేడమీంచి నేలమీదకి విసిరేసినట్టుగా మా జీవన విధానం మారిపోయినా కాస్త కూడా బాధ అనిపించలేదు నాకు. నిజం చెప్పాలంటే సంతోషించాను. నా ప్రేమదేవతను తప్పక గెల్చుకోగలనన్న భావనతో.

పరిస్థితుల ఒత్తిడికి తట్టుకోలేక దిగులుతో, గుండెపోటుతో నాన్నగారు పోవడంతో ఇంటి బాధ్యత పూర్తిగా నా మీదే పడింది. ఉద్యోగ ప్రయత్నాలు ఎంత ముమ్మరంగా చేసినా, ఏదో టెంపరరీ ఉద్యోగాలు ఒకటి, రెండు చోట్ల చేయడం తప్పించి సరైన ఉద్యోగ

## ఇం'ధనం'

కొనవూపిరితో / దీపం వెలుగు!
గుండెల ప్రమిదలో
ఆశల ఇం'ధనం' నింపేను
మళ్ళీ వెల్తురే వెల్తురు!

## ఐకమత్యం!

బ్రతికుండగా / పట్టించుకోలేదు...
స్వర్గస్తులయ్యేక / కర్మకాండలు
పంచుకున్నారు!
అన్నదమ్ములంతా / ఐకమత్యంతో ఆస్తి
వాటాలేసుకున్నారు!!

## తేడా

భాష / ఒక మీడియా!
స్పందన మాత్రం / ఒక వీడియో!

## స్నేహం

పౌర్ణమి వెన్నెలకూ / డిసెంబరు మంచుకూ
ఎంతటి స్నేహం?
స్నేహితురాలా / నీ మనసెందుకంత
అగ్నిగుండం?

## పిచ్చి

పూర్వం
రూల్సు వ్యతిరేకిస్తే
పిచ్చివాడనే వారు!
ఇప్పుడు
రూల్సు మాట్లాడితే
పిచ్చివాడంటున్నారు!

## సినీమాయ

అప్పుడు
బ్రతికి
బట్టకట్టేవాళ్ళు!
ఇప్పుడు
బట్టలూడదీసుకొని
బ్రతుకుతున్నారు!

–గుడిమెట్ల గోపాలకృష్ణ

## బృందావన నానీలు

**పూ**వు సౌరభాన్ని
ఆస్వాదించు
తావి మూలం కోసం
పూవును చీల్చి చూడకు.
మసీదులో పావురాలకు
గుప్పెడు గింజలు చల్లు
బాంబుల్ని మాత్రం
విసరకేం!
కిరీటమున్నా / కోడిపుంజు రాజుకాదు
అల్పుడికి
పదవి వన్నె తేబోదు
ఎవడికి తోచినట్లు
వాడర్థం చేసుకుంటాడు
జీవితం
లిపి పన్లేని భాష
గుండెల్లో ఉప్పెనతో
ఓ వేదన తర్వాత
కాగితం తొట్లో
కవిత్వం శిశువు!
విజయం
అలసత్వాన్ని కల్గించొచ్చు
అపజయం
పట్టుదలను పెంచొచ్చు!
అపజయాల
సోపానాలెక్కుతూ
అధిరోహించొచ్చు
విజయసింహాసనాన్ని!
రేపటి కష్టానికి
నేడు దిగులేల?
ఇప్పుడే ధైర్యాన్ని
కోల్పోజేస్తుంది చింత!
పోతూపోతూ
మబ్బు పెట్టిన గిలిగింత
కొండ కొమ్ముకు
తడి పులకరింత!
శిశిరంలో / చితికిపోయిన ప్రకృతిని
ఓపిగ్గా పునర్నిర్మిస్తూ / వసంతం!

–సి హెచ్. వి. బృందావనరావు

మేదీ నాకింతవరకూ నిలకడగా దొరకలేదు. రోజులు, నెలలు భారంగా గడచిపోతూనే ఉన్నాయి.

○ ○ ○

ఈ రోజు నా ఆనందానికి అవధుల్లేవు.

నాకు హైదరాబాద్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. పర్మనెంటు పోస్టు. మంచి ఉద్యోగం అంటే నా ఉద్దేశంలో ఆఫీసరు ఉద్యోగం అని కాదు. నా చదువుకి పెద్ద పెద్ద ఆఫీసర్ల ఉద్యోగాలెలా వస్తాయి? గుమాస్తా ఉద్యోగమే వచ్చింది. కానీ పర్మనెంటు పోస్టు. అదీ నా సంతోషం. ఇదివరకులా టెంపరరీ వేకెన్సీలో రెండు నెల్లూ, మూడు నెల్లూ చేసిన బాపతు ఉద్యోగం కాదు. గుమాస్తా ఉద్యోగం అయితేనేం? ఈ మాత్రం కూడా లేనివాళ్ళు ఎంతమంది లేరూ ఈ రోజుల్లో? అన్నిటికీ మించిన సంతోషం నాకిప్పుడు మరొకటి ఉంది. అది సభాపతిగారిని కలవడం. ఆయన పెట్టిన గడువు కూడా ఎప్పుడో పూర్తయిపోయింది. ఉద్యోగం దొరక్క నాదే లేటైంది. ఇప్పుడు ఉద్యోగంలో జాయిన్ అయ్యాక వాళ్ళ ఊరెళ్ళి సభాపతిగారిని కలవాలి. ఇప్పటికీ మీ అమ్మాయి రూపం నా మనసులోంచి చెక్కుచెదరలేదని చెప్పాలి. మీకూ, మాకూ అంతస్తుల భేదం ఇప్పుడే మాత్రం లేదని సవినయంగా మనవి చేసుకోవాలి. పుష్కరని నేను పెళ్ళి చేసుకుందుకు అనుమతించమని ఆశీర్వదించమని అడగాలి.

○ ○ ○

ఆ ఇల్లు సమీపిస్తుంటే నాలో ఏదో మాటల్లో వర్ణించలేని పులకింత, ఉద్వేగం!

"ఎవరు కావాలి?" తలుపు తీసి ప్రశ్నించిన ఆమెని చూస్తూనే జవాబు చెప్పాలన్న స్పృహ కూడా లేక అలా నిలబడిపోయాను.

నాలుగైదేళ్ళ కిందట... పరికిణీ, వోణీలో సన్నజాజి రెమ్మలా ఉన్న నా ప్రేమదేవత ఇప్పుడు చీరలో మరింత అందంతో మెరిసిపోతూ మల్లెమొగ్గలా దర్శనమిస్తే గుర్తుపట్టిన నా గుండె గబగబా వేగంగా కొట్టుకుంది. మాటే మరచిన వాడిలా, మాటల్లో చెప్పలేని మధురానుభూతితో, ప్రేమ పూజారిలా నిలబడ్డాను ఆమె ముంగిట.

"ఎవరు కావాలండీ?" కోయిల కూసింది నా వీనుల విందుగా తిరిగి మరోసారి.

"సభాపతిగారు... లేరా?"

"రండి. లోపలకు రండి. బయటికెళ్ళారు. ఇప్పుడో పావుగంటలో వచ్చేస్తారు. కూర్చోండి."

మంత్రించినట్టుగా వెళ్లి కూర్చున్నాను సముద్రపు అలల్లా లేచిపడుతున్న భావావేశాన్ని లోలోపలే అణిచి పెట్టుకుంటూ.

"హాయ్, పుష్కరా! హార్టీ కంగ్రాచ్యులేషన్స్! ఐ.ఏ.ఎస్. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యావట కదా అబ్బా! ఎంత అదృష్టవంతురాలివి? ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ అయిపోయావన్నమాట!" బిలబిలలాడుతూ నలుగు రమ్మాయిలు బయటనుంచి వచ్చి ఆనందంతో పుష్కరను పట్టి ఊపేశారు.

ఒక్క క్షణం నా గుండె ఆగిపోయిందా అనిపించింది.

స్నేహితురాళ్ళందరికీ చిరునవ్వుతో 'థాంక్స్' చెప్తున్న పుష్కర... నా ప్రేమ దేవత... నా దేవి... నాకు అందని ఎత్తు ఎదిగిపోయినట్టు కనిపించింది. ఎలా?

ఇప్పుడేం చెయ్యాలి. ఆరోజు... ఒకప్పుడు... నన్ను పై అంతస్తువాడిలాగ లెక్కవేసి, మన మధ్య అంతస్తుల భేదం ఉందన్నారు సభాపతిగారు. ఈరోజు... ఆ అంతస్తులు తారుమారైన ఈరోజు నేనెలా నోరు తెరచి అడగగలను? ఈమె ఐ.ఏ.ఎస్. ఆఫీసర్! నేను... నేనో గుమస్తాని. నన్ను పెళ్ళిచేసుకోమని ఈమెని అడగడం ఈమెకి అన్యాయం చేసినట్టే అవుతుంది. కాదా మరి? అలా అడగడం ఉచితమా కాదా అని ఆలోచించే ఇంగితజ్ఞానం కూడా లేనివాడిగా నన్ను జమకట్టరూ? నా మనసులోని ప్రేమ ఎవరికి కనబడుతుంది. ఎవరికీ కనబడని ప్రేమ, ఎవరికీ అంతుబట్టని ఆ ప్రేమ నన్నో అత్యాశాపరుడిగా నలుగురి ముందూ నిలబెడుతుంది. అంతకంటే నా ఈ ప్రేమని... మూగ మనసు అరల్లో దాచిపెట్టుకోవడమే ఉత్తమం కాదూ?

నా కళ్ళు చెమ్మగిల్లాయి నా గుండె బరువెక్కింది. మనస్ఫూర్తిగా మూగగా ఇన్నేళ్ళుగా ఆమెని ప్రేమిస్తున్న నేను కడసారిగా, ఓరగా ఆమె వంక చూస్తూ, ఆమెగానీ, ఆ స్నేహితురాళ్ళు గానీ నన్ను గమనించకుండా జాగ్రత్త పడుతూ నెమ్మదిగా ఆ ఇంట్లోంచి బయటికి వచ్చేశాను.

ఆమె చదువుకి, ఆమె ఉద్యోగానికీ తగ్గ మంచి వరుడు ఆమెకు లభించాలని ఆ భగవంతుడిని కోరుకోవడమే నేను ఆమెకు చేయగల మేలు అనిపించింది.

నా ప్రేమదేవత చల్లగా, పదికాలలపాటు పచ్చగా, సంతోషంగా వర్ధిల్లాలని నా మనసు ఆరాటపడటంలో వింతేముంది? ■

## క్యాలండర్

గదిలోని క్యాలండర్ కూడ ఓ జ్ఞాపకమే
భవిష్యత్తుని గుండెలో దాచుకుని
ఒక్కొక్క పేజీలో ఎంతో జీవితకాలాన్ని నింపుకుని
క్యాలండర్ పేజీలు మారినప్పుడు
జీవితం కూడా మారకపోతుందా
అని ఎదురు చూసేవాళ్ళకు క్యాలండర్ ఓ జ్ఞాపకమే
ప్రతి పుట్టినరోజు పోగొట్టుకున్న ఆనందాన్ని తెచ్చినట్టు
కొత్త క్యాలండర్ ఎన్నో ఆశల్ని మోసుకొస్తుంది
క్యాలండర్ చూస్తున్నప్పుడు
మనసులో మనకు తెలియకుండానే
ఏవేవో ప్రణాళికలు వేసుకుంటాం
రోజూ కొత్త ఉత్సాహంతో
కాలం వెంట పరిగెత్తుతూ
గుండె నిండా భరోసా నింపుకుంటాం
తేదీలు మారుతున్నప్పుడు
అఘమేఘాల మీద
పసిడి కాంతుల వసంతాన్ని తెచ్చిన
క్యాలండర్ కూడా ఓ జ్ఞాపకమే
జారిపోతున్న కాలానికి గుర్తుగా
సంవత్సరాల తరబడి మౌనసాక్షిగా
గోడ మీద క్యాలండర్
ప్రతి పేజీలో ఓ అనుభవాన్ని నింపుకుని
రేపటి ఉదయం కోసం
ఈరోజే పురిటి నొప్పులు పడుతుంది
పండుగ వస్తుందని తెలిసి
క్యాలండర్ చూడాలంటేనే ఎందుకో భయం
అల్లుడు ఆర్డరిచ్చిన ఐటమ్స్‌కి బిల్లు కట్టలేక
పిల్లనిచ్చిన తండ్రి కార్చిన కన్నీళ్ళకు
నిలువెత్తు సాక్ష్యం క్యాలండర్
రాబోయే కాలాన్ని స్వాగతిస్తూ
ప్రతి పేజీలో చిరునవ్వులు చిందిస్తూ
లోపల విషాదాన్ని దాచుకుంటుంది క్యాలండర్
క్యాలండర్ జీవితంలో ఓ భాగమే కాదు
మనల్ని దిశానిర్దేశం చేసేది క్యాలండరే
క్యాలండర్ని గోడమీంచి తొలగించామంటే
కొన్ని అనుభూతుల్ని మన మనసులో దాచుకున్నట్టే
క్యాలండర్ నడుస్తున్న కాలానికి ప్రతీక
అంకెలతో కాలాన్ని శాసించే కాలసూచిక.

-చొక్కర తాతారావు